వినాయక.. సెలవిక

కల్వకుర్తిరూరల్: తొమ్మిది రోజులుగా పూజలు అందుకున్న గణనాథుడి నిమజ్జనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పలు చోట్ల మట్టి గణపతులను ప్రతిష్ఠించారు. వైష్ణవి అపార్ట్‌మెంట్ సభ్యులు ఆదివారం రాత్రి మట్టిగణపతులను మండపం వద్దే నిమజ్జనం చేశారు. కాలనీవాసులు అపార్ట్‌మెంట్ సభ్యులు బిందెలతో మట్టిగణపతిపై నీళ్లు పోసి అక్కడే నిమజ్జనం చేశారు.

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్, గోపులాపురం వంటి గ్రామాల్లో యువకులు నృత్యాలు చేస్తూ వినాయకుడిని ఊరేగిస్తూ సాగనంపారు. గ్రామంలోని చెరువులలో నిమజ్జనం చేశారు.

మన్ననూర్: గ్రామంలోని రుక్మిణి మహిళా సంఘం ఆధ్వర్యంలో వేణుగోపాల స్వామి ఆలయం, అంబేడ్కర్ కాలనీలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలలో ఉంచి డీజే ఆట పాటలు, మహిళలు గొబ్బెమ్మలు ఆడుతూ ఊరేగించారు. కార్యక్రమంలో బిల్లకంటి రమేష్, మాజీ ఎంపీటీసీ బాలమ్మ, వైస్ ఎంపీపీ సంబు శోభ, సరస్వతి, జయమ్మ, అనిత, మంజుల, సుమతి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.


మన్ననూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు తదితర గ్రామాల్లో నిమజ్జనం సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. లడ్డూ వేలపాటలను ఉత్సాహంగా నిర్వహించారు. కోలాటాలు, వివిధ కళాప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

గోవిందాయిపల్లిలో లడ్డూ రూ. 2.90 లక్షలు

తాడూరు/లింగాల: తాడూరు మండలంలోని గోవిందాయిపల్లిలో గణేష్ యువక బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద లడ్డు వేలం రికార్డుస్థాయిలో పలికింది. రూ.2.90 లక్షలకు వేంకటేశ్వర గణేష్ బృందం సభ్యులు లడ్డూను కైవసం చేసుకున్నారు. గత సంవత్సరం రూ.1.90 లక్షలు పలికింది. అదేవిధంగా లింగాలలోని దారారంలో గ్రామ పంచాయతీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూను నియోజకవర్గం యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ రాథోడ్ రూ.1.01 లక్షలకు వేలపాట ద్వారా దక్కించుకున్నారు.


తాడూరులో లడ్డూను దక్కించుకున్న యువక బృందం

గణనాథుడికి ఎమ్మెల్యే పూజలు


కల్వకుర్తిలో గణపతి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా కొలువుదీరిన గణనాథులకు తొమ్మిదో రోజు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల వద్ద యువతీ, యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కల్వకుర్తి పట్టణంలోని పలు గణపతి మండపాల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని వినాయకుడికి పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని శివాజీ యువసేన, హనుమాన్ దేవాలయంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాల వద్ద మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పూజలు నిర్వహించారు. ఆయన వెంటన మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, సూర్యప్రకాశ్‌రావు, గోవర్ధన్, మధు, భగత్‌సింగ్ తదితరులు ఉన్నారు. మండలంలోని మార్చాల, జీడిపల్లి, తర్నికల్, తాండ్ర గ్రామాల్లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయతి ఆశాదీప్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కల్వకుర్తిలోని విద్యానగర్‌లో మట్టి గణపతిని ప్రతిష్ఠించిన వినాయక మండపాల వద్ద మానవతా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ రమ్య, డాక్టర్ శరత్‌లు వెండి గణపతి ప్రతిమను నిర్వాహకులకు అందజేశారు. తాడూరులో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో, తెలకపల్లిలో భక్తబృందాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. వెల్దండ మండలం నారాయణపూర్‌లోని విజయ గణపతి దేవాలయంలో గణపతికి అభిషేకం, హోమం నిర్వహించారు.


కల్వకుర్తి మండలం మార్చాలలో హోమంలో పాల్గొన్న ఆశాదీప్‌రెడ్డి


కల్వకుర్తిలో శివాజీ యువసేన మండపంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

క్లుప్తంగా

ఆలయ నూతన కార్యవర్గం ఏర్పాటు



అమ్రాబాద్: మండల కేంద్రంలో ఉన్న దేవాలయ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా రాములు, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శి వడుగుల శ్రీనివాసులు, కోశాధికారి సత్యనారాయణలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నియామక పత్రాలు అందుకున్నారు. ఆలయ అభివృద్ధికి బాధ్యతగా పని చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌గా శ్రీధర్



వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా శ్రీధర్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల హైకోర్టు ఉత్తర్వులు రావడంతో పాఠశాలల్లో ప్రిన్సిపాల్‌తో పాటు 18 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ పుష్పలత రంగారెడ్డి జిల్లా కందుకూర్ మోడల్ స్కూల్‌కు, కందుకూర్ ప్రిన్సిపాల్ విధులు నిర్వర్తిస్తున్న శ్రీధర్ మండలానికి బదిలీపై వచ్చారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం



కొల్లాపూర్: మిలాద్ ఉన్ నబీ పర్వదిన వేడుకలను పురస్కరించుకొని పట్టణంలోని ముస్లింలు గంధోత్సవం నిర్వహించారు. జామె మసీద్ నుంచి గంధోత్సవం ప్రారంభమై పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. ఆఫీసాహెబ్ ఆరీఫ్ షుత్తారీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జామెమజీద్ కమిటీ అధ్యక్షుడు ఖాజా చావుష్, కార్యదర్శి పర్వేజ్, కమిటీ నాయకులు జాఫర్, మహిమూద్, మోసిన్, ఖాదర్‌పాషా, మైనొద్దీన్, మోయిన్ తదితరులు ఉన్నారు.

దస్తావేజులేఖరుల సంఘం ఏకగ్రీవ ఎన్నిక



నాగర్‌కర్నూల్‌రూరల్: దస్తావేజులేఖరుల జిల్లా సంఘాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా దస్తవేజులేఖరుల సంఘం నాయకులు టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జహీర్, వెంకటయ్యలు హాజరై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు పి పార్థసారథి, వైస్ ప్రెసిడెంట్ హరికృష్ణ, ఆర్ మధు, జనరల్ సెక్రెటరీ ఎండీ అన్వర్, జాయింట్ సెక్రెటరీ కృష్ణ, పరశురాములు, భరత్, అఫీజ్, ట్రెజరర్‌గా రఘు, ఈసీ మెంబర్లుగా ఆంజనేయులుగౌడ్, సురేందర్‌రావు, ప్రవీణ్, మౌలానాలు ఎన్నికయ్యారు.

జూపల్లిలో పెద్దమ్మ తల్లి బోనాలు



చారకొండ: మండలంలోని జూపల్లిలో యాదవ కులస్తుల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి బోనాలను యాదవ కులస్తులు ఆదివారం నిర్వహించారు. గ్రామంలో మహిళలు బోనాలను అలకరిం మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా అమ్మవారి దేవాలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటయ్య యాదవ్, ఎనుములు వెంకటయ్య, సుల్తాన్, మల్లయ్య, బిక్షపతి, రామస్వామి, జంగయ్య, సాయిలు మహిళలు తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఎన్నిక

అచ్చంపేట: డివిజన్ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నూతన కమిటీ ఎన్నికను ఆదివారం అచ్చంపేటలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాత్కుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా మద్దెల దివాకర్, ఎల్లికంటి శ్రీను, అంతయ్య, స్వామి, ప్రధాన కార్యదర్శిగా లింగమయ్య, సహాయ కార్యదర్శులుగా నిరంజన్, శ్రీనివాసులు, కోశాధికారిగా పెర్ముల రాజేష్, కార్యదర్శులుగా అనిల్‌కుమార్, రాంకోటి, గోపాల్, పాండు, ఆంజనేయులు తదితరులు ఎన్నికయ్యారు.

పని చేసిన వారికే గుర్తింపు

మన్ననూర్: పనిచేసే వారికే పార్టీ తప్పనిసరిగా గుర్తింపునిస్తుందని కో ఆప్షన్ మాజీ సభ్యుడు ఎంఏ రహీం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం బీసీ వర్గానికి చెందిన బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌ను రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా నియమించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కన్వర్షన్ ఉద్యోగులుగా గుర్తించాలి



అచ్చంపేట రూరల్: విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్స్, ఎస్పీఎం కార్మికులను ప్రభుత్వ కన్వర్షన్ ఉద్యోగులుగా గుర్తించాలని యూనియన్ జేఏసీ అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని హాజీపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆర్టిజన్స్, ఎస్పీఎం కార్మికులు ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీగా ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ కన్వర్షన్ ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో జేఏసీ గౌరవ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటయ్య ఉపాధ్యక్షుడు శ్రీనయ్య, కోశాధికారి వెంకట్‌రాంనాయక్ తదితరులు ఉన్నారు.

మూడు రోజుల నుంచి నీటి సరఫరా బంద్

లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో మూడు రోజుల నుంచి నీటి సరఫరా నిలిచింది. దీంతో గ్రామస్తులు నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని స్థానికులు విమర్శించారు. ప్రత్యేకాధికారి, కార్యదర్శి తనకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని నీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ ప్రత్యేకాధికారి బాల్‌రాంను వివరణ అడగగా పంచాయతీకి సంబంధించిన బోరు మోటారు చెడిపోవడంతో బాగు చేయించామని విషన్ భగీరథ పైపుల లీకేజీ వలన నీటి సరఫరా కాలేదని తెలిపారు. నీటి సమస్య రాకుండా చూస్తామని వివరించారు.

నేడు బీజేపీ సమావేశం

అచ్చంపేట: నియోజకవర్గ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 16న సోమవారం ఉదయం 10 గంటలకు ఎస్‌జీ బ్యాంకెట్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు మండికారి బాలజీ, చందులాల్ చౌహాన్ తెలిపారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జి బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు బాషా, మాజీ ఎంపీ రాములు హాజరవుతారని పేర్కొన్నారు.

కొనసాగుతున్న జాతీయ రహదారి పనులు


పెద్దకొత్తపల్లిలో కాలువల నిర్మాణ పనులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో జాతీయ రహదారి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు ఉన్న జాతీయ రహదారి 167కె పనులు మండల కేంద్రంతో పాటు చెన్నపురావుపల్లి, కల్వకోలు గ్రామాల్లో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సైడ్ కాలువలతో పాటు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. వర్షం కారణంగా 15 రోజుల పాటు రోడ్డు పనులు నిలిచిపోయాయి. అదేవిధంగా కొల్లాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఫ్లెక్షైవర్ బ్రిడ్జి పనులు నిర్వహిస్తున్నారు.

నీటి ఉధృతికి ధ్వంసమైన కల్వర్టు



తెలకపల్లి: మండలంలోని గౌరారం గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టు వరద ధాటికి ధ్వంసం అయ్యింది. గౌరారం ఊరచెరువు కింద ఎమ్మెల్సీ నిధుల నుంచి పర్వతాపూర్, గౌరారం గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లోని పొలాలకు వెళ్లే రైతుల సౌకర్యార్థం నిమిత్తం గౌరారం ఊర చెరువు అలుగు కింద కల్వర్టు నిర్మించారు. వర్షాకాలంలో రాకపోకలకు ఆటంకం కలగకుండా ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న నిధుల నుంచి నిర్మించిన కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పర్వతాపురం, గౌరారం ఊర చెరువులు ఒక్కసారిగా అలుగులు పారాయి. దీంతో నీరు ఉధృతంగా ప్రవహించి అలుగు కింద నిర్మించిన కల్వర్టుకు ఇరువైపుల ఉన్న మట్టి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే ధ్వంసమైన కల్వర్టును మరమ్మతు చేసి ఇబ్బందులు తీర్చాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

బ్రిడ్జి పనులను పరిశీలించిన ఆచారి



కల్వకుర్తిరూరల్: హైదరాబాద్ నుంచి నంద్యాల జాతీయ రహదారి నిర్మాణం పనులను ఆదివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి పరిశీలించారు. పట్టణ సమీపంలో జాతీయ రహదారిపై బ్రిడ్జి నిర్మాణం పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించి కాంట్రాక్టర్‌తో పనుల విషయంపై ఆచారి మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కల్వకుర్తి మీదుగా నిర్మిస్తున్న ఈ జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే తిరుపతికి దూరభారం తప్పుతుందన్నారు. ఆయన వెంట నాయకులు రాఘవేందర్‌గౌడ్, రాంచంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, బాబీదేవ్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు. అనంతరం పట్టణంలోని పలు వినాయక మండపాలను సందర్శించి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గేమ్యానాయక్ తండాను పంచాయతీగా గుర్తించాలి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని గేమ్యానాయక్ తండాను గ్రామ పంచాయతీగా గుర్తించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తండాలో పార్టీ రెండో శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాకు గ్రామ పంచాయతీకి కావలసిన అన్ని అర్హతలు ఉన్నాయని పేర్కొన్నారు. రాజకీయ నాయకుల కారణంగా గ్రామ పంచాయతీగా గుర్తించకపోవడం సరికాదన్నారు. అంతకుముందు పార్టీ జెండాను పార్టీ శాఖ కార్యదర్శి బాలు ఎగురవేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శివవర్మ, తారాసింగ్, మధు, సాయిరాం, నగేష్, శ్రీకాంత్, అంజి, బాషా, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కల్వకుర్తిరూరల్: లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని నూతన లారీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంపికైన నయీం, గౌరవాధ్యక్షుడు ఆనంద్ కుమార్‌లు అన్నారు. ఆదివారం పట్టణంలోని లారీ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని లారీ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. ఉపాధ్యక్షుడిగా కృష్ణయ్య, ప్రధాన అధ్యక్షుడిగా షబ్బీర్ అలీ, కార్యదర్శిగా వెంకటయ్య, ఉప కార్యదర్శిగా మక్బుల్, కోశాధికారిగా డేవిడ్, సలహాదారులుగా ఎజాస్, న్యాయ సలహాదారులుగా జమీల్ తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థికసాయం



వెల్దండ: మండలంలోని రాచూర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ నాగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం బాధిత కుటుంబానికి కల్వకుర్తి డివిజన్ ఫొటోఅండ్‌వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగినేని రవికుమార్ ఆధ్వర్యంలో రూ.35,500 ఆర్థికసాయం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, అనిల్‌గౌడ్, లట్టు, వాహేద్, జెలాల్, నందు, రియాజ్, పెద్ద నాగయ్య, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

మండలంలోని పెద్దాపూర్‌లో అనారోగ్యంతో వేమల జంగమ్మ మృతి చెందింది. ఆదివారం మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో రూ.5వేలు, గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు అల్లాజీగౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు మట్ట వెంకటయ్యగౌడ్, తదితరులు ఉన్నారు.

టీఎన్‌జీఓ డివిజన్ అధ్యక్షుడిగా సురేష్‌గౌడ్



అధ్యక్షుడు సురేష్‌గౌడ్, కార్యదర్శి ప్రమోద్

కల్వకుర్తిరూరల్: తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం డివిజన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సురేష్‌గౌడ్, కార్యదర్శిగా ప్రమోద్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల ఇన్‌చార్జిగా మురళీధర్‌రెడ్డి వ్యవహరించారు. ఎన్నికైన వారికి టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, మాజీ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, కార్యదర్శి లింగం, కోశాధికారి రాఘవేందర్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ



తాడూరు: మండలంలోని పాపగల్‌లో గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మాజీ ఎంపీటీసీ రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జయకృష్ణారెడ్డిలు లబ్ధిదారుడికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి కృషి కారణంగా గ్రామానికి చెందిన అనారోగ్యానికి చెందిన ముగ్గురు కుటుంబాలకు మరో రెండు చెక్కులు మంజూరయ్యాయని వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాహేర్, లింగం, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అచ్చంపేట: పట్టణంలోని షామ్స్ ఫంక్షన్‌హాల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని హైస్కూల్ విభాగం 1990–91 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగితెలుసుకున్నారు. 33 ఏళ్ల తర్వాత కలుసుకోవడం సందడిగా గడిపారు. అప్పటిగురువులను సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివ గోవర్ధన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ తారాసింగ్, అంబోతు ధర్మనాయక్, నషిరొద్దీన్, శివ విజయ్, జమీల్, గిరి, కొత్రవెంకటేష్, స్వామి కొండ తదితరులు పాల్గొన్నారు.

విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

కొల్లాపూర్: నిజాం నిరంకుశ పాలన నుంచి భారతదేశంలో తెలంగాణ విలీనం అయిన సెప్టెంబర్ 17న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా విలీన దినోత్సవ వేడుకలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ కోరారు. ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల వేడుకలు నిర్వహించారు. పట్టణంలో రైతాంగ పోరాటంలో పాల్గొని అమరుడైన సీఆర్ శర్మ మనుమరాలిని సీపీఐ నాయకులు సత్కరించారు. అనంతరం బాల్‌నర్సింహ, రాష్ట్ర నాయకుడు ఫయాజ్ మాట్లాడారు. విలీన దినోత్సవ వేడుకలకు బదులుగా ప్రజాపాలన వేడుకలు నిర్వహించడం తగదన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని బీజేపీ నాయకులు జరుపుకోవడం హాస్యాస్పదం అన్నారు. సీపీఐ నాయకులు వెంకటేష్, ఇందిర, నర్సింహ, శివుడు, తిరుపతయ్య, యూసుఫ్, ఉస్మాన్‌బాషా, మాసూంబాబా, సోహైల్, గోవిందరెడ్డి, కొండన్న, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.